# అంగడిలో దొరకనిది...

## -కిరణ్‌బాల

**ఆకాశం కడివెడు దుఃఖాన్ని కడుపులో దాచుకున్న కన్నతల్లిలా ఉంది. అటు వర్షమూ పడటంలేదు. ఇటు ఎండా కాయటంలేదు. ఎప్పుడు భోరున వర్షం పడుతుందో తెలీదు!**

**"అమ్మా! అమ్మమ్మొచ్చిందీ." పెద్దగా అరుస్తూ వచ్చింది పాప. ఎదురుగా వాకిట్లోకి వెళ్ళి అమ్మచేతిలోని సంచిని అందుకొంటూ "బాగున్నావా అమ్మా!" అన్నాను. తలపూపింది అమ్మ.**

"ఇల్లు తెలుసుకోవటం కష్టం కాలేదు కదా!" అడిగాను. మేము ఇల్లు మారాక అమ్మరావటం ఇదే మొదటిసారి.

"ఓ కిరాణాషాప్ అతణ్ణి అడిగితే చెప్పాడు. వాళ్ళబ్బాయి మీ స్కూల్లోనే చదువుతున్నాడట." అంది అమ్మ.

అమ్మ హఠాత్తుగా రావటంనాకు ఆశ్చర్యంగా ఉంది. ఎంతో అవసరముంటేగానీ రాదు. అసలు నేను బలవంతం చేస్తేనే అదీ నా వెంట ఏ ఏడాదికో, రెండేళ్ళకో వచ్చే అమ్మ ఇలా చెప్పాపెట్టకుండా, అనుకోకుండా రావటం నాకు విస్మయాన్ని కలిగించింది.

ఏమన్నా అడిగితే నొచ్చుకుంటుందేమో అని వూరుకున్నాను.

"బాబేడీ?" పాపకి తనుతీసుకొచ్చిన పళ్ళు ఇస్తూ అడిగింది.

"పక్కింట్లో ఆడుకుంటున్నా డమ్మా." చెప్పాను.

పాప పరుగున పక్కింట్లోకి వెళ్ళింది. ఐదునిమిషాల్లో బాబుతో తిరిగొచ్చింది. అమ్మ వాణ్ణి రెండు చేతుల్తో దగ్గరకు తీసుకొని గుండెకి హత్తుకుంటూ "బాగున్నావా నాన్నా, బాగా చదువుతున్నావా? అంది.

'ఓ!... అమ్మమ్మా, మరి అక్క చదూకోవట్లేదు." వాడన్నదాంట్లో కొంతనిజం లేకపోలేదు. కనుక వాడివేమీ అన్లేక పోయాను. కానీ పిల్లలకి ఈ చాడీలు చెప్పేగుణం ఎలా వస్తుందో తెలీదు.

చదువు ప్రస్తావన వచ్చిందికనుక పిల్లలిద్దరూ పుస్తకాలు ముందేస్కుని పేజీలు తిరగేస్తున్నారు.

అమ్మా, నేనూ భోజనానికి కూర్చున్నాం. అమ్మ ఎక్కువగా మాట్లాడలేకపోతోంది. కొసరి వడ్డిస్తుంటే 'వద్దమ్మా', 'చాలు, చాలు' అంది. నేను అందరి యోగ క్షేమాలూ పేరుపేరునా అడిగాను.

అమ్మ ఎందుకు వచ్చిందో మాత్రం అర్థంకాలేదు. మాకున్న పెద్దదిక్కు తానొక్కతే. కాబట్టి అమ్మ వచ్చినందుకు నాకు సంతోషంగానే ఉంది.

అయితే అమ్మ ఏదైనా ఘర్షణపడి రాలేదు కదా? తానుఎంత బాగా మాట్లాడ్తోన్నా ఎక్కడో బాధ ధ్వనిస్తోంది.

సాయంత్రం మావారొచ్చారు. అమ్మ పలకరించింది. వారూ ఆశ్చర్యపోయినట్టున్నారు. కుశల పరామర్శలయ్యాయి.

మర్నాడు పిల్లల్ని స్కూల్‌కి పంపించి నేనూ వెళ్ళాను. నేను మండల్ యు.పి.యస్.లో టీచర్‌గా పనిచేస్తున్నాను.

వారుసబ్ పోస్టాఫీస్‌లో పనిచేస్తున్నారు. పిల్లలు పబ్లిక్ స్కూల్లో చదువుతున్నారు. మధ్యాహ్నం సెలవు పెడ్తానంటే "నాకోసం ఎందుకులే" అంది అమ్మ.

పాత పత్రికలు కొన్ని ఏరి, అమ్మ ముందు టేబుల్‌పై వేశాను. వాటితో కాలక్షేపం చేయమని.

★ ★ ★

ఆరోజు గడిచింది. మరో రెండు రోజులు కూడా గడిచాయి. వాతావరణంలో మార్పేమీలేదు. ఆకాశం అలాగే ఉంది. ఎండాలేదు, వానాలేదు. చిరాకేస్తోంది. ఎండలో వేసిన బట్టలుకూడా ఆరటంలేదు.

అమ్మ మూగవేదనేమిటో అర్థం కావటంలేదు. నేను ఆమెను మాటల్లోపెట్టి అసలు విషయం గ్రహించలేకపోయాను.

పైగా వచ్చినవాటి కంటే అమ్మ ఇప్పుడు పిల్లల్తో కలిసిపోయి నవ్వుతూ, సంతోషంగా ఉంది.

ఒక్కొక్కసారి ఆ సంతోషం తెచ్చిపెట్టుకున్నదేమోననీ, మరొక్కసారి నేనే అనవసరంగా నెగెటివ్‌గా ఆలోచిస్తున్నానేమో అనీ అనిపిస్తోంది. కూతుర్నిచూడాలనిపించి వచ్చిందేమోలే; అని సరిపెట్టుకున్నాను.

★ ★ ★

అమ్మ వచ్చి నాలుగు రోజులవుతోంది. నేను లీవ్ పంపాను. పిల్లలు స్కూల్‌కి వెళ్ళారు. వారూ డ్యూటీకి వెళ్ళిపోయారు. ఉదయం పది గంటలు కావస్తోంది. పోస్ట్‌మాన్ వచ్చి లెటర్ ఇచ్చివెళ్ళాడు. ఆ ఉత్తరం నాకే. చేవ్రాలు చెల్లెలిది. చింపాను.

పూజ్యురాలైన అమ్మకి...

అమ్మకి వ్రాసిన ఉత్తరంకదా అని బల్ల మీద ఉంచాను. అమ్మ స్నానం చేస్తోంది. వచ్చాక చదువుతుందనీ...

హైదరాబాదు మహానగరంలో పన్నెండొందల రూపాయల కిరాయింట్లో అమ్మా, ఇద్దరు తమ్ముళ్ళూ, ఇద్దరు చెల్లెళ్ళూ ఉంటున్నారు.

పెద్ద తమ్ముడు ఒక పెద్దకంపెనీలో మేనేజర్. పెద్ద చెల్లెలు ఒక ఫార్మాస్యూటికల్ కంపెనీలో పనిచేస్తోంది. చిన్న చెల్లెలు పదో తరగతి. చిన్న తమ్ముడు వాడేంచేస్తున్నాడో వాడికే తెలీదు. ప్రస్తుతం స్నేహితులతో కాలక్షేపం చేస్తుంటాడని ఒక్కమాటలో చెప్పొచ్చు.

ఇంకోవిషయం మరిచాను. పెద్ద తమ్ముడికి భార్యా, మూడునెలల పాపాయీ ఉన్నారు.

టూకీగా అమ్మావాళ్ళ సంగతు లివీ.

స్నానం చేసి వచ్చింది 'అమ్మ. పద్మ ఉత్తరం వ్రాసిందని చెప్పాను. ఆదరాబాదరగా చీరచుట్టుకుని ఉత్తరం చేతుల్లోకి తీసుకుంది అమ్మ.

ఐదు నిమిషాల తర్వాత "ఏం రాసింద మ్మా" అని అడిగాను.

సమాధానం లేదు. నేను వినబడలేదేమో నని మళ్ళీ అడిగాను. కుర్చీలో కూర్చుంటూ ఉత్తరం నాచేతి కిచ్చింది అమ్మ.

పూజ్యురాలైన అమ్మకి,

నమస్కారాలు!

నీవు వెళ్ళిన దగ్గరనుండీ నాకయితే అన్నం సయించటంలేదు. తప్పదు కనుక లతక్క ఇంత కతికి పోతుంది. నేను ఈ రోజు స్కూల్‌కి వెళ్ళలేదు. చిన్నన్న నువ్వెళ్ళాక వచ్చాడు. ఫ్రెండ్స్‌తో కల్సి శ్రీశైలం వెళ్తున్నానని చెప్పి బట్టలు సర్దుకొని వెళ్ళాడు. అమ్మేదని మాటవరసకి అడిగాడు. పెద్దక్క దగ్గరకి వెళ్ళిందని నేను చెప్పిన సమాధానం బహుఃశ వినిఉండడు.

అంతే, ఇంక మిగతావాళ్ళకి నీ గురించి పట్టింపే లేదు. బిక్కుబిక్కుమనుకుంటూ నేను ఓ మూలపడి ఉన్నాను.

వాళ్ళు నాతోకానీ, నేను వాళ్ళతోకానీ మాట్లాడలేదు. నువ్వెళ్ళి పోయిన తర్వాత నాకు ఎంతో ఏడుపొచ్చింది.

చచ్చిననాన్నని చాలా తిట్టుకున్నాను. నీకోసం చిల్లిగవ్వయినా మిగల్చని నాన్న పిల్లల్ని మాత్రం పారేసిపోయాడు. ఇలాంటి కొడుకుల్ని ఇచ్చినందుకు ఏ దేవుణ్ణి తిట్టుకోవాలో నువ్వు. వీళ్ళా మా అమ్మకొడుకులని నాకు డోకొస్తోంది. నా అన్నలనుకోవాలంటేనే సిగ్గేస్తుంది.

అమ్మా! ఈ ఉత్తరాన్ని ఏడుస్తూ వ్రాస్తు న్నాను. నీవు మాత్రం రాకమ్మా! ఎవరైనా వచ్చి తీసుకువచ్చేదాకా రాకు.

అక్కకి నువ్వు బరువుకాదు. పిల్లల్తో సం తోషంగా అక్కడే ఉండు. నా గురించేం బాధపడకు. నీ అభిమానాన్ని మాత్రం చంపుకోవద్దు.



అక్కాబావలకి నమస్కారాలు, పిల్లలకి ముద్దులు.

ఇట్లు

నీ ప్రియమైన కూతురు

పద్మజ

ఎట్టుమని పదహారేళ్ళన్నాలేని పద్మ ఎంత ఆరిందాలా వ్రాసింది! దానికి ఉన్న బుద్ధీ,జ్ఞానం మగపిల్లలకి లేకపోయింది.

ఉత్తరం చదివాక మనసంతా ఎవరో పిండేస్తున్నంత బాధ కలిగింది. అమ్మకీ పెద్దతమ్ముడికీ మధ్య ఘర్షణ జరిగిందా? లేక మరదలు అమర్యాదగా ప్రవర్తించిందా? ఎప్పుడూ ఎవరినీ పల్లెత్తు మాట అనని అమ్మ, ఎవరితోనూ మాటపడని అమ్మ, కష్టపడి పిల్లల్ని ప్రేమతో కంటికి రెప్పలా కాపాడుకుంటూ, పెంచుకున్న అమ్మ ఎంత బాధని గుండెల్లో దాచుకుంది!

ఈ నాలుగురోజులూ మర్చిపోవటానికి ఎంత ప్రయత్నించింది! మాటల్లో ఎక్కడా బయటపడలేదు. నా మనసు కష్టపెట్టకూడదనుకుందో ఏమో!

"అసలేం జరిగిందమ్మా?" అన్నాను. కి చాపమీద అమ్మకుర్చీపక్కనే కూర్చుంటూ.

"నేనేమీ అనలేదమ్మా, మీ మరదల్ని కాస్త అన్నం వార్చమన్నాను. పురుడుపోసీ, చాకిరీచేసీ, పసిదానికి స్నానం చేయించీ, తల్లీబిడ్డల బట్టలు కూడా ఉతికాను.

మూడునెలల చాకిరీలో ఒక్కనాడన్నా విసుక్కోలేదు. ఆరోజు వంటచేస్తున్నాను. పని తొందరలో ఉన్నాను.

పెద్దోడు ఆదివారమైనా ప నుంది ఆఫీసుకి వెళ్ళాలన్నాడు. కూరకి అన్నీ సిద్ధం చేస్తున్నాను. కాస్త వచ్చి, అన్నం వార్చమన్నాను. తప్పా?

తన గది లోంచి బయటికి రాలేదు. 'అత్త'ని ఆ మాత్రం పనిచెప్పేఅధికారం చనువూ నాకులేవా? వాడు... ఇంతెత్తున లేచాడు.

'ఎవ్వరూలేరా ఇంట్లో, చచ్చారా? పద్మేదీ? దీన్నే పిలవాలా?' అన్నాడు గయ్యిన.

ఆ మాటలు కోడలంటే నాకేం బాధ లేకపోయేది, కానీ కన్నకొడుకే అలా మాట్లాడ్డం నాకు నచ్చలేదు."

అమ్మ చల్లో అభిమానం, అవమానం.

బయట ఆకాశంలో ఓ పెద్ద ఉరుము ఉరిమింది. ఫెళ ఫెళ ధ్వనులు.

"సుజాతా! వానొస్తుంది. బట్టలు తీసుకో." ఇంటావిడ కేకతో పరుగున వాకిట్లోకి వెళ్ళాను.

ఆరేసిన బట్టలుతీస్తూ పైకి చూశాను. ఆకాశంలో దట్టంగా నల్లని మేఘాలు పెద్ద పెద్ద చినుకులతో వర్షం!

అంతా చీకట్లు కమ్ముకున్నాయి. నాలుగు రోజుల్నుంచీ మబ్బు పట్టిన ఆకాశం ఈరోజు వర్షిస్తోంది.

లోపలికొచ్చాను. అమ్మ వెక్కి వెక్కి ఏడుస్తోంది. అమ్మ దగ్గరగా వెళ్ళి తలమీద చేయివేశాను.

నాకు బుద్ధి తెలిసిన దగ్గర నుండీ చాలా తక్కువసార్లు బహుశ ఒకటీ, రెండుసార్లు అమ్మ ఏడ్చినపుడు చూశాను.

ఉమ్మడి కుటుంబంలో బండెడు చాకిరీ చేసినా ఏడ్వలేదు. చెల్లెలికి జబ్బుచేసి మూణ్ణెల్లు మంచం పట్టినా ఏడ్వలేదు. కొడుక్కి ఉద్యోగం దొరక్కపోయినా, కూతురికి సంబంధం కుదరకపోయినా ఏడ్వలేదు. అందరి అమ్మల్లా అప్పుడప్పుడూ నాన్నని తల్చుకొనో, తిట్టుకొనో ఏడ్వలేదు. ఏడిస్తే పిల్లలు బెంబేలు పడిపోతారనీ,అమ్మగుండె ధైర్యానికి బహుశ :దేవుడుకూడా ఆశ్చర్యపడేవాడేమో! నవ్వుతూ, నవ్విస్తూ ఎప్పుడూ ఆహ్లాదంగా ఉండే అమ్మ ఏడుస్తోంది, పసిపాపలా... ఓదార్చాలి నేను అమ్మని అమ్మలా...

"ఏడవకమ్మా, ఊరుకో" అమ్మ భుజాలమీద చేతులు వేసి నిమురుతూ అన్నాను.

అమ్మ నా రెండు చేతుల్లో తలపెట్టుకొని రోదించింది. నేను ఊరడించబోతే దుఃఖం ఎక్కువవుతుందని మిన్నకుండిపోయాను. నాకూ ఏడుపొస్తోంది. నా చేతులు అమ్మకన్నీళ్ళతో తడీతడిగా, బయట ఆకాశం కూడా భోరున ఏడుస్తోంది.

ఏడ్వనీ! ఇన్ని రోజుల హృదయతాపం అమ్మదైనా, ఆకాశానిదైనా కరిగి కన్నీరవ్వనీ...!

కాస్త తేరుకున్నాక అమ్మ అంది.

"వాణ్ణి నేనేం అనలేదు. వాడు ఎన్ని వెధవ్వేషాలు వేసినా కడుపులో దాచుకున్నాను. ఇప్పుడంటే పెళ్ళాం ఉందని నిలకడగా ఉద్యోగం చేస్తున్నాడు.


కానీ గతంలో వాడితో ఎన్ని బాధలు పడ్డాను. పల్లెత్తుమాట అన్నానా? ఈనాడు పెళ్ళాం రాగానే తల్లి కంటికి కనిపించటం లేదా! తల్లి అంటే ఇంత చులకనా!... నేనేం తక్కువ చేశాను వాడికి?

ఒళ్ళు దాచుకోకుండా, విసుక్కోకుండా ఎంత పనిచే శాను! కాస్త కునుకు తీసే టైంలో పసిదాని ఏడుపు వినిపిస్తే పరుగునపోయి ఎత్తుకున్నాను.

వాడి పెళ్ళాంకీ ఎంత చాకిరీ చేశాను. ఆ విశ్వాసం లేదు వాడికి.

ఏనాడూ బతుక్కి సుఖంలేదు. మీనాన్న మారాజుతో ఆనాడూ... ఈ మగపిల్లల్తో ఈనాడూ... ఏనాడు చేసుకున్న ఖర్మమో! ఏ జన్మలో చేసుకున్న పాపమో!"

ఆ తర్వాత మా ఇద్దరి మధ్యా కుటుంబ విషయాలు అనేకం ప్రస్తావనకి వచ్చాయి. అయితే అమ్మ దుఃఖించటం చూస్తే అమ్మకీ, తమ్ముడూ, మరదలకీ మధ్య ఏదో పెద్ద వాగ్వివాదం జరిగిందని తెలుస్తోంది.




★ ★ ★

తెల్లవారింది. ఆదరాబాదరాగా అమ్మ అందరి కంటే ముందుగానే తయారైయ్యింది. బయట తెల్లవార్లూ కురిసిన వర్షంతో ఇప్పుడు ఆకాశం నిర్మలమైంది.

"ఏంటమ్మా హడావిడి పడ్తున్నావ్?" అమ్మ ముఖంలోకి పరిశీలనగా చూస్తూ అడిగాను.

ఆ ముఖంలో నిన్నటి దుఃఖం ఛాయలులేవు. వాటిస్థానే ఆతృత, ఆరాటం కనిపిస్తున్నాయి.

"అవును తల్లీ, వెళ్ళాలి. అప్పుడే నాలుగు రోజులైపోయాయి."

"అదేంటమ్మా, నువ్వు ఇంకో నాలుగైదు రోజులు ఉంటేకానీ వాడికి బుద్ధిరాదు." అన్నాను కాస్త కటువుగా...

సమాధానం లేదు. మళ్ళీ అన్నాను.

"పద్మ రాసిందికదా. రావద్దని.... కాస్త మనశ్శాంతి కుదిరే వరకూ ఉండు. నిజంగా నీమీద ఏ మాత్రం ప్రేమ ఉన్నా, పశ్చాత్తాపంతో వాడే వస్తాడు." అన్నాను.

"లేదు, వాడు రాడు."

"రాకపోతే పోనీ నువ్వెందుకమ్మా వెళ్ళటం కాస్త ఆగు."

"వాడు. నేను అన్నం పెట్టకపోతే సరిగా తినడమ్మా! పెళ్ళాం ఎంత ప్రియమైనా, తిండిదగ్గర నేనుండాలి. వాడిభోజనం విషయం ఆవిడ సరిగ్గా చూసుకోదు. పైగా ఆవిడగారికి వంటా వార్పూ సరిగారావు. చంటిపిల్లతో ఎంత అవస్థ పడుతుందో ఏమో!

మధ్యలో పసిదాన్ని ఎంత ఏడిపిస్తారో... వీళ్ళిద్దరి మధ్యలో పద్మజ హైరానా పడ్తుంది.

లతకా... రెండు బస్‌లు మారి కంపెనీకి వెళ్ళాలి. పొద్దున్నే టిఫిన్, వంటా కావాలి." అక్కడ తాను చేసే పనులన్నీ ఏకరువు పెట్టింది.

అమ్మ. అమ్మ చెప్పటం ఎలా ఉందీ అంటే తనులేకపోతే ఆ పనులన్నీ ఎవరు చేస్తారని ప్రశ్నించినట్టుంది.

"వాడికి నేను దగ్గరుండి అన్నం వడ్డించాలి. 'అమ్మా! అన్నంపెట్టమని నన్నే పిలుస్తాడు. నేను వెళ్తానమ్మా."

అమ్మ మాటల్లో ఎక్కువౌతున్న ఆరాటం చూస్తుంటే నేనెంత చెప్పినా ఇక ఆగదనీ ఒకవేళ మరీ బలవంతం మీద తనని ఆపినా మనశ్శాంతి కంటే బాధే ఎక్కువవుతుందనీ గ్రహించాను.

"వీళ్ళు వెళ్ళనీ... భోజనం చేసి వెళ్దువుగానీ. నేనొచ్చి బస్సెక్కిస్తాను." అన్నాను.

అమ్మని బస్సెక్కించాను. బస్ వెళ్ళిపోయింది. ఆలోచిస్తూ నడుస్తున్నాను. పధ్నాలుగేళ్ళకే కాపురానికి వచ్చిన అమ్మ కలవారి కోడలు కలికి కామాక్షి లాంటిది.

కష్టాలూ, కన్నీళ్ళూ, పేదరికం, ఒంటరి తనం అన్నీ అనుభవించినా ధైర్యం కోల్పోలేదు.

ఈనాడు ఎంత బేలతనం! బహుశః రాత్రంతా సరిగా నిద్రపోయి ఉండదు. తమ్ముడు గురించే ఆలోచించి ఉంటుంది. ఎంత తొందరగా క్షమించేసింది నాకు తమ్ముడిమీద చాలాకోపం వచ్చింది.

కని, పెంచి, పెద్దచేసిన తల్లికంటే రెండేళ్ళు కాపురం చేసిన పెళ్ళాం ఎక్కువయి పోయిందా?

"ముందొచ్చిన చెవులకన్నా వెనకొచ్చిన కొమ్ములు వాడి" అనే సామెత అందుకే పుట్టిందేమో!

కానీ తల్లి అలాకాదే! బిడ్డ కడుపున పడ్డ నాటి నుండీ బిడ్డ మీద ఎన్ని ఆశలు పెంచుకుంటుంది. ఆడపిల్ల తర్వాత పుట్టిన మలిచూలు మగబిడ్డ తమ్ముని ఎంతగా ప్రేమించిందో!

అమ్మ ప్రేమని అడుగడుగునా చవిచూసిన తమ్ముడు అమ్మతో అట్లా మాట్లాడవల్సింది కాదు. కన్నతల్లిని కష్టపెట్టి ఏం సాధిద్దామనీ?

ఎంతబాధ, అవమానం ఫీలయితే వచ్చిందో అమ్మ! లేకపోతే ఎన్నడైనా పిల్లల్ని విడిచి ఎక్కడికైనా వెళ్ళిందా?

కానీ చెల్లెలి ఉత్తరం అందిన మర్నాడే అమ్మ వెళ్ళిపోతానని, అమ్మ నిర్ణయించుకోవడంతో అమ్మ మనస్సు అర్థం కాలేదు.

ఏదో కోపంలో వచ్చేసింది. నాకే విషయం చెప్పకుండా నాలుగు రోజులు గడిపేద్దామనుకుంది. కానీ మనసు మనసులో లేకపోయింది.

తన చేతుల్తో వండి వడ్డించందే పిల్లలు తినరట. ముఖ్యంగా తమ్ముడు! అమ్మ పిచ్చిగానీ వాళ్ళకేం వాళ్ళు బాగానే ఉంటారు. కానీ తల్లి మనసు ఊరుకోదే రమ్మని వాడుత్తరం వ్రాయలేదు. అమ్మ ఎక్కడికెళ్ళిందనయినా అడగలేదట.

మరి అమ్మ పసిదానిగురించీ, ఆ కొడుకూ కోడలు గురించీ ఆలోచిస్తోంది. తాను లేకపోతే వాళ్ళు ఎంత కష్టపడ్తారో అనీ, వాళ్ళు కష్టపడితే ఈ తల్లి మనసు ఊరుకోదన్న మాట. ఆహా,మాతృమూర్తీ నీకు జోహార్!

దూరంగా రేడియోలో కాబోలు పాట విన్పిస్తోంది. "అంగడిలో దొరకనిది అమ్మ ఒక్కటే, అందరికీ ఇలవేలుపు అమ్మ ఒక్కటే."

నిజమే! ఎంత గొప్పగా అమ్మ విలువని తెలియజెప్పాడు కవి. వేయి వరహాలిచ్చినా అమ్మ ప్రేమకి ఖరీదు కట్టగలమా!

వాతావరణం పూర్తిగా మారి పోయింది. వర్షం కురిసి మబ్బులు తొలిగి ఆకాశం నిర్మలంగా... అమ్మ మనసులా కన్పిస్తోంది!



